# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 24-02-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ శాంతి పరిరక్షక చర్యల్లో మహిళల పాత్ర కీలకమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- ❖ పీఎం కిసాన్ సమ్మాన్ నిధి 19వ విడత నిధులను ప్రభుత్వం ఈ రోజు విడుదల చేసింది.
- ❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ మధ్యప్రదేశ్ లోని భోపాల్ నగరంలో ఈరోజు ప్రపంచ పెట్టుబడుల సదస్సును ప్రారంభించారు.
- ❖ మహిళలను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆర్ బి ఐ మేనేజర్ అభిషేక్ మజుందార్ పేర్కొన్నారు.
- ❖ కార్మికుల సామాజిక భద్రతను పెంపొందించడానికి చర్యలు తీసుకుంటునామని కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవియా తెలిపారు.

=====================

శాంతి పరిరక్షక మిషన్‌లో మహిళల పాత్ర కీలకమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ఈ రోజు న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన గ్లోబల్ సౌత్ మహిళా శాంతి పరిరక్షకుల సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ... ఈ మిషన్‌లో మహిళలు లింగ ఆధారిత హింసను పరిష్కరించడంలో చురుగ్గా పాల్గొంటున్నారని తెలిపారు. అలాగే శాంతి పరిరక్షక కార్యక్రమాలు నిర్వహించడం లోనూ ముఖ్య భూమిక పోషిస్తున్నారని ఉద్ఘాటించారు. దీర్ఘకాలిక శాంతి ఒప్పందాలను సాధించడం ఎక్కువ శాతం మహిళా సిబ్బందితోనే సాధ్యపడుతుందని వ్యాఖ్యానించారు. అదే విధంగా ఐక్యరాజ్య సమితి శాంతి పరిరక్షక మిషన్లలో ఎక్కువ మంది మహిళలను చేర్చుకోవడం చాలా అవసరమని రాష్ట్రపతి అభిప్రాయం వ్యక్తం చేశారు. భారత మహిళా శాంతి పరిరక్షకులు విధులు నిర్వహించడంలో ముందంజలో ఉన్నారని రాష్ట్రపతి పేర్కొంటూ....

(వాయిస్ 33 సెకన్లు)

=====================

రైతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి వుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈరోజు బీహార్‌లోని భాగల్పూర్ నుండి ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి 19వ విడతను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు 3.5 లక్షల కోట్ల రూపాయల నిధులను రైతుల ఖాతాలకు జమ చేశామని తెలిపారు. లక్షలాది మంది సన్నకారు రైతులకు ఆర్థిక సాయం అందించామన్నారు. వ్యవసాయ ఖర్చులు తగ్గాయని, వారి ఆదాయం కూడా పెరిగిందని పేర్కొన్నారు. ఈ పథకం కింద అర్హులైన రైతులకు మూడు విడతలుగా 2 వేలు రూపాయల చొప్పున సంవత్సరానికి 6 వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు.

ఇదిలా ఉండగా కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల గురించి అవగాహన కల్పించడానికి ఈ రోజును కిసాన్ సమ్మాన్ సమరోహ్‌గా జరుపుకుంటామన్నారు.

=====================

భారతదేశ చరిత్రలో ప్రపంచం మొత్తం భారతదేశం వైపు ఆశావాదంతో చూడటం ఇదే తొలిసారి అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈరోజు భోపాల్‌లో జరిగిన “గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్”ను ఆయన ప్రారంభించారు. సామాన్య ప్రజలు, ఆర్థికవేత్తలు, సంస్థలు భారత్‌పై అంచనాలను కలిగి ఉన్నాయని నరేంద్ర మోదీ అన్నారు. ప్రపంచ బ్యాంకు నుండి ప్రపంచంలోని అన్ని ప్రధాన సంస్థల వరకు భారతదేశాన్ని అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా పిలుస్తున్నారని, దేశంపై ప్రపంచం ఉంచిన ఈ నమ్మకం రాష్ట్రాల విశ్వాసాన్ని కూడా పెంచిందని వ్యాఖ్యానించారు. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే వస్త్ర, పర్యాటక, సాంకేతికత రంగాలు అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ మూడు రంగాలలో సాంప్రదాయ నైపుణ్యాలను ప్రోత్సహించడమే కాకుండా నూతన రంగాలపై కూడా పని చేస్తోందని నరేంద్రమోదీ మాట్లాడుతూ...

(వాయిస్ 38 సెకన్లు)

=====================

మహిళల ఆర్థికాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందని ఆర్.బి.ఐ. మేనేజర్ అభిషేక్ మజుందార్ తెలిపారు. అరుణాచల్ ప్రదేశ్ ఇటానగర్‌లోని డి.కె.కన్వెన్షన్ సెంటర్‌లో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాన్ని ఈరోజు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ రోజు నుండి 28వ తేదీ వరకు "ఆర్థిక అక్షరాస్యత - మహిళల శ్రేయస్సు" అనే ఇతివృత్తంతో ఈ ప్రచార కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. మహిళలను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వ బ్యాంకులు అందించిన అన్ని డిజిటల్ ఆర్థిక బ్యాంకింగ్ యాప్‌లను ఉపయోగించుకునేలా బ్యాంకర్లు ఖాతాదారులకు చేరువ కావాలని ఆయన కోరారు. ఇటువంటి కార్యక్రమాలపై ప్రజలకు బ్యాంకులు అవగాహన కల్పించాలన్నారు.

విరామం

=====================

కార్మిక సంక్షేమం సామాజిక భద్రతను పెంపొందించడానికి కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవియా ఈరోజు న్యూఢిల్లీలో అంతర్జాతీయ కార్మిక సంస్థ డైరెక్టర్ జనరల్ గిల్బర్ట్ హౌంగ్బోతో చర్చలు జరిపారు. వికసిత్ భారత్ 2047, G20 ప్రాధాన్యతలకు అనుగుణంగా శ్రామిక శక్తి పునరుద్ధరణకు దేశ నిబద్ధత ముఖ్య ఉద్దేశమని సామాజిక మధ్యమం వేదికగా తెలిపారు. స్థిరమైన భవిష్యత్‌ను రూపొందించేందుకు ప్రణాళికలు చేపట్టానున్నామని కేంద్రమంత్రి తెలియజేశారు.

=====================

మౌలిక సదుపాయాల కల్పనలో గణనీయమైన అభివృద్ధి జరిగిందని కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా అన్నారు. యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమంలో భాగంగా జమ్మూ కాశ్మీర్ యువతతో ఆయన సంభాషించారు. గత 10 సంవత్సరాల్లో జమ్మూ కాశ్మీర్ లో ఎన్నో మార్పులు జరిగాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. రోడ్లు, రైల్వేలు, విమానాశ్రయాలను మెరుగుపరచడం వంటి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంలో కృషి చేశామన్నారు. జమ్మూ కాశ్మీర్‌లో కొత్త విశ్వవిద్యాలయాలు, ఐఐఎంలు, ఎయిమ్స్‌లను ప్రారంభించామని మంత్రి తెలియజేశారు.

=====================

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను ఉపయోగించి రక్షణ రంగంలో కొత్త పరిశోధనలు జరగాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. ఈ రోజు హిమాచల్ ప్రదేశ్‌లోని ఐఐటీ 16వ వ్యవస్థాపక దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ... ఈ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి దాదాపు 70 శాతం రక్షణ పరికరాలు దేశీయంగానే ఉత్పత్తి అవుతున్నాయని అన్నారు. రక్షణ రంగంలో భారతదేశం స్వావలంబన సాధిస్తోందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

=====================

ప్రయాగ్ రాజ్ లో జరుగుతున్న మహాకుంభ మేళాను సందర్శించే యాత్రికులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడానికి భారతీయ రైల్వే నిరంతరం ప్రయత్నాలు చేస్తోంది. రైల్వే బోర్డులో ఏర్పాటు చేసిన వార్ రూమ్ నుంచి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. క్రౌడ్ మేనేజ్ మెంట్ ను పరిశీలించేందుకు కేంద్రమంత్రి న్యూఢిల్లీ రైల్వే స్టేషన్ ను సందర్శించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ.. న్యూఢిల్లీ రైల్వేస్టేషన్ లో రద్దీ నియంత్రణకు పలు చర్యలు తీసుకున్నామన్నారు.

=====================

ఢిల్లీ శాసనసభ సభాపతిగా రోహిణి నియోజకవర్గం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న భారతీయ జనతా పార్టీ శాసనసభ్యులు విజేందర్ గుప్తా ఎన్నికయ్యారు. అసెంబ్లీ సమావేశాలు ఈ రోజు ప్రారంభం కాగా, స్పీకర్ పదవికి విజేందర్ గుప్తా పేరును ముఖ్యమంత్రి రేఖా గుప్తా ప్రతిపాదించారు. దీనికి బీజేపీ ఎమ్మెల్యే మంజిందర్ సింగ్ సిర్సా మద్దతు పలికారు. అనంతరం మూజువాణి ఓటుతో విజేందర్ గుప్తా స్పీకర్‌గా ఎన్నికయ్యారు.

=====================

ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షక చర్యలకు భారత్ అధిక తోడ్పాటు అందిస్తోందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. ఈ మధ్యాహ్నం న్యూఢిల్లీలో జరిగిన మొట్టమొదటి మహిళా శాంతి పరిరక్షకుల సదస్సులో కేంద్రమంత్రి తన వీడియో సందేశంలో ప్రపంచ శాంతిలో శాంతి పరిరక్షక దళం చాలా ముఖ్యమైన పాత్రను పోషిస్తుందని పేర్కొన్నారు. కాగా రక్షణ మంత్రిత్వ శాఖ, ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షక కేంద్రం సహకారంతో విదేశాంగ శాఖ రెండు రోజుల పాటు ఈ సదస్సును నిర్వహిస్తోంది.

=====================

దేశీయ స్టాక్ మార్కెట్‌లు ఈరోజు భారీ నష్టాలతో ముగిసాయి. సెన్సెక్స్ 74,893 పాయింట్ల వద్ద నష్టాలతో ప్రారంభమై.. చివరకు 74,454 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 242.55 పాయింట్లు పతనమై 22,553 వద్ద ముగిసింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 4 పైసలు క్షీణించి 86.72 వద్ద స్థిరపడింది.

=====================

=====================